# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 384 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 14-3-2025 | వెల : .రూ. 5.00


## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.





## తెలంగాణలో 'భారత్ సమ్మిట్'

- ఓబామా లాంటి ప్రముఖుల హాజరు
- 60దేశాల ప్రతినిధులకు ఆహ్వానం
- కేంద్రాన్ని అనుమతి కోరాం: రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ,/మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్ )
తెలంగాణలో 'భారత్ సమ్మిట్' పేరిట ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సుమారు 60 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ సమ్మిట్‌కు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తదితరులు హాజరయ్యే అవకాశముందని చెప్పారు. భారత్ సమ్మిట్‌కు కేంద్ర ప్రభుత్వం క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుందని.. -మిగతా 2 లో



## తెలంగాణ లో ఐదు ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

- ఎట్టకేలకు చట్టసభలోకి దాసోజు శ్రవణ్

హైదరాబాద్,
తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐదు స్థానాలకు 5 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్, భారాస నుంచి దాసోజు శ్రవణ్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం ఎన్నికయ్యారు. వీరు కాకుండా ఆరుగురు స్వతంత్ర -మిగతా 2 లో



## దక్షిణాదిపై కేంద్రం పగ

### 22 న జెసీ సమావేశానికి రేవంత్‌కు డిఎంకె ఆహ్వానం

- పార్టీ ఆదేశాలు తీసుకుని వస్తానని వెల్లడించిన రేవంత్
- తెలంగాణలో అంతకుముందే అఖిలపక్ష భేటీ
- భేటీకి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికీ ఆహ్వానం
- ఢిల్లీలో వెల్లడించిన సీఎం రేవంత్



న్యూఢిల్లీ,/మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్ )
కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలు తీసుకుని డిఎంకె నిర్వహించే జెఎసి సమావేశానికి హాజరవుతానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రఅన్యాయం జరుగబోతోందని అన్నారు. దీనిపై తెలంగాణ -మిగతా 2 లో

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రైతులు ఆనందంగా ఉండేలా పథకాల అమలు
- సీతారామ ప్రాజెక్టుతో 3లక్షల ఎకరాలకు సాగునీరు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

ఖమ్మం,/
రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. 'ప్రతి రైతు ఆనందంగా ఉండాలి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా -మిగతా 2 లో






## 15 నుంచి ఒంటిపూట బడులు

- ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట
- ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు మాత్రమే

హైదరాబాద్,/మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్ )
తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9గంటల నుంచే భానుడి తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావటానికి జనం జంకుతున్నారు. రాబోయే రోజుల్లో తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో ప్రభుత్వం పాఠశాలల సమయంపై కీలక నిర్ణయం తీసుకున్నది. -మిగతా 2 లో



## జగదీశ్ రెడ్డి పై వేటు

- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు
- సమావేవాలు ముగిసేవరకు వేటు
- జగదీశ్ రెడ్డి తీరుపై మండిపడ్డ మంత్రులు
- దళిత స్పీకర్‌ను అవమానించడం దారుణమన్న సీతక్క
- ఎథిక్స్ కమిటీకి అప్పగించాలని డిమాండ్

హైదరాబాద్,మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్ )
మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి శాసనసభ నుంచి సస్పెండ్ అయ్యారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. సస్పెండ్ -మిగతా 2 లో



## ఉద్దేశ్యపూర్వకంగానే సస్పెండ్


### మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ ఆరోపణ

హైదరాబాద్,మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్ )
జగదీశ్‌రెడ్డిని ఉద్దేశపూర్వకంగా సభ నుంచి సస్పెండ్ చేశారని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ తర్వాత భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ...స్పీకర్ పట్ల -మిగతా 2 లో

## కొందరు నాయకులతో పార్టీకి భారీగా నష్టం

- ఎంపీలు, ఎమ్మెల్సీ తీరుపై బీజేపీ ఎమ్మెల్సీ రాజాసింగ్ లేఖ విడుదల
- వారు బయటకుపోతే తప్ప రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాదు
- రాజాసింగ్ లేఖపై సర్వత్రా చర్చ

హైదరాబాద్,మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్ )
పార్టీలో కొంతమంది ఎంపీలు, ఎమ్మెల్యేలను టార్గెట్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖను రిలీజ్ చేశారు. తెలంగాణలో ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వ ముఖ్యమంత్రితో కొందరు నేతలు రహస్య సమావేశాలు -మిగతా 2 లో



## మద్యం దిగుమతులపై 200 శాతం పన్ను

- ఈయూకు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్:మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్ )
షాంపైన్, వైన్ సహా అన్ని రకాల మద్యం దిగుమతులపై 200 శాతం పన్ను విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫ్రాన్స్, ఇతర యూరోపియన్ యూనియన్ దేశాలను హెచ్చరించారు. అమెరికా విస్కీపై యూరోపియన్ యూనియన్ 50 శాతం సుంకాన్ని -మిగతా 2 లో



# దక్షిణాదిపై కేంద్రం పగ

(మొదటి తరువాయి)

కాంగ్రెస్ కూడా అఖిలపక్ష భేటీని ఏర్పాట చేసిందన్నారు. దీనికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కూడా ఆహ్వానించామని అన్నారు. కేంద్ర కేబినేట్‌లో ఉన్న కిషన్ రెడ్డి దక్షిణాది రాష్ట్రాల ఇబ్బందులను కేంద్రానికి తెలియచేయాల్సి ఉందన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రేంవత్‌ని ఈ నెల 22న జరగనున్న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి హాజరు కావాలని తమిళనాడు డీఎంకే నేతలు ఆహ్వానించారు. ఈ క్రమంలో జేఏసీ సమావేశానికి రేవంత్ రెడ్డి రావాలని డీఎంకే ఎంపీలు కనిమొళి, రాజా, ఎన్. ఇలాంగో, కళానిధి వీరస్వామి సీఎంను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. స్టాలిన్ డీలిమిటేషన్ విషయంలో చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. తమిళనాడులో సమావేశానికి హాజరయ్యేందుకు ఏఐసీసీ అనుమతి తీసుకుని వస్తామన్నారు. డీలిమిటేషన్ పక్రియ దక్షిణాది రాష్ట్రాలపై ప్రభావం చూపుతుందని, ఉత్తరాది రాష్ట్రాల కంటే ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నాయని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూడా డీలిమిటేషన్ పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కూడా రావాలని కోరుతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో కిషన్ రెడ్డి తన అభిప్రాయాలను కేంద్ర క్యాబినెట్‌లో వినిపించాల్సిన అవసరం ఉందని రేవంత్ ప్రస్తావించారు. తెలంగాణలోని అన్ని పార్టీలు కూడా ఆ సమావేశంలో పాల్గొనాలని కోరారు. ఈ క్రమంలో డీలిమిటేషన్ పై మార్చి 22న జరుగనున్న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి ముఖ్యమంత్రికి ఆహ్వానం అందింది. తమిళనాడులో జరగనున్న ఈ సమవేశానికి పలు ప్రాంతీయ పార్టీలు హాజరై డీలిమిటేషన్ పై వారి అభిప్రాయాలను తెలియజేయనున్నాయి. ఇప్పటికే డీలిమిటేషన్ పై తమిళనాడు డీఎంకే నేతలు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ పక్రియ తమ రాష్ట్రంలో ప్రజల హక్కులను హరించే దిశగా ఉందని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో తెలంగాణ సీఎం రేవంత్ కూడా ఈ అంశంపై చర్చిస్తామన్నారు. దీంతో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం ముఖ్యమైన చర్చలకు ఒక వేదికగా నిలిచే అవకాశం ఉంది. ఈ సమావేశంలో తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ వంటి ప్రాంతాల ప్రగతికి సంబంధించిన నిర్ణయాలను తీసుకునేందుకు కీలక అంశంగా మారనుంది. డీలిమిటేషన్ వల్ల వచ్చే రాజకీయ పరిణామాలు, రాష్ట్రాల మధ్య సంబంధాలు, వాస్తవాలపై ప్రాధాన్యం కలిగిన అనేక అంశాలపై చర్చలు జరగనున్నాయి. అయితే ఈ భేటీకి మరికొన్ని రోజుల సమయం ఉన్న నేపథ్యంలో మరిన్ని రాష్ట్రాలు కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి తరువాయి)

అధికారులు వెంటనే స్పందించాలి' అని సూచించారు. అలాగే, 'రైతు భరోసా పథకం కింద ఈ నెలాఖరు వరకు రూ.10 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నాం' అని వెల్లడించారు. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించబోతున్నాం అని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా బేతుపల్లి, లంకాసాగర్ ప్రాజెక్టులకు గోదావరి నీళ్లు చేరనున్నాయి. అలాగే, శ్రీరామ చంద్రుని కృపతో కొద్ది నెలల్లోనే గోదావరి జలాలను సాగు కోసం వినియోగించగలమని తెలిపారు. జిల్లా సత్తుపల్లి మండలం యతాలకుంట గ్రామంలో సీతారామ టన్నెల్ వద్ద వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై విశేషాలు వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో సత్తుపల్లికి ప్రత్యేక గుర్తింపు ఉందని, తాను రాజకీయ చైతన్యం వచ్చినప్పటి నుండి అభివృద్ధికి కృషి చేశానని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాల్లో రోడ్డు మార్గాలను విస్తృతంగా అభివృద్ధి చేశామని, ప్రస్తుతం ప్రతి గిరిజన గ్రామానికి రహదారులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్య కోసం పిల్లలు స్కూల్స్‌కు సులభంగా వెళ్లగలిగే పరిస్థితి రావడం తనకు ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజలకు నమ్మకం కలిగే విధంగా నిర్ణయాలు తీసుకుంటే పెద్దగా ఇబ్బంది ఉండదని మంత్రి అభిప్రాయపడ్డారు. సత్తుపల్లిలో ఎలాంటి సమస్యలు లేవని, స్థానిక ఎమ్మెల్యే రాగమయి ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 'పంటలు లాభసాటిగా ఉండేలా హార్టికల్చర్‌ను ప్రోత్సహించాలి. హార్టికల్చర్ చేయలేని స్థితిలో ఉంటే వరి పండించండి' అని సూచించారు. ఫామాయిల్ ధర గతంలో రూ.1200గా ఉండేదని, ప్రస్తుతం అది రూ.20,800కి పెరిగిందని తెలిపారు. అలాగే, ఉగాది నాటికి ఖమ్మం జిల్లాలోని కల్లూరు గూడెంలో ఫామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. ఖమ్మం నుంచి రాజమండ్రికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం ఆగస్టు 15నాటికి పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. దీనితో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని, వ్యాపార అభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. 'నా మొట్ట మొదటి కోరిక సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడమే' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ సహకారంతో ప్రాజెక్టు త్వరగా పూర్తి చేసి, రైతులకు నీటిని అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సత్తుపల్లి అభివృద్ధిలో తమ ప్రభుత్వం కృషి చేస్తుందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు.

# జగదీశ రెడ్డి పై వేటు

(మొదటి తరువాయి)

అయిన సభ్యుడిని సభ నుంచి బయటకు పంపాలని స్పీకర్ ఆదేశించారు. కాగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సభలో గందరగోళం సృష్టించాయి. 'మీరు మేము ఎన్నకుంటేనే స్పీకర్ అయ్యారు. సభ మీ ఒక్కరిదీ కాదు - సభ అందరదీ' అని స్పీకర్‌ను ఉద్దేశించి జగదీష్ రెడ్డి అన్నారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతకుముందు జగదీష్ వ్యాఖ్యలపై శాసనసభలో వాడీవేడీ చర్చ జరిగింది. సభ లోపల, బయట స్పీకర్ నిర్ణయాన్ని ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఏకవచనంతో స్పీకర్‌పై మాట్లాడటం బాధాకరమన్నారు. స్పీకర్‌ను అవమానించకుండా ఆదర్శంగా నిర్ణయం తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ అంశాన్ని ఎథిక్స్ కమిటీకి అప్పగించాలని.. అప్పటి వరకు ఈ సేషన్ మొత్తం ఆ సభ్యున్ని సస్పెండ్ చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఈరోజు సభ్యుడు మాట్లాడిన భాష అత్యంత అవమానకరమన్నారు. ఒక దళితజాతి బిడ్డ స్పీకర్‌గా మాట్లాడటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని.. స్పీకర్‌ను టార్గెట్ చేయడం బాధాకరమన్నారు. ఆ సభ్యుని సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. జగదీష్ రెడ్డి మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందన్నారు. బలహీన వర్గాలు ఇప్పుడిప్పుడే ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం వచ్చాక... బీఆర్ఎస్ అడిగినన్ని సార్లు అవకాశం ఇచ్చారన్నారు. జగదీష్ రెడ్డి అత్యంత అవమానకరంగా మాట్లాడారని మండిపడ్డారు. మీకు మీకు అని మాట్లాడడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. గవర్నర్‌ను పట్టుకుని కాంగ్రెస్ కార్యకర్త అని ఎలా అంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో గవర్నర్ మాట్లాడింది.. తమ ప్రభుత్వ విధానం అని కేసీఆర్ సభలో చెప్పలేదా అని నిలదీశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్‌ను దారుణంగా అవమానించారన్నారు. జగదీష్ రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలని స్పీకర్‌ను కోరుతున్నాని మంత్రి సీతక్క తెలిపారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు గవర్నర్ ప్రసంగం సందర్భంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌లను సస్పెండ్ చేశారన్నారు. పార్లమెంట్‌లో టీఎంసీ సభ్యుడు ప్రవర్తన సరిగా లేనందున సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. జగదీష్ రెడ్డిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఎథిక్స్ కమిటీకి రెఫర్ చేయాలని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. సభ్యులు చర్చ అనంతరం జగదీష్ రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటించారు.అయితే సభలో మాట్లాడే అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరగా.. అందుకు స్పీకర్ అనుమతి ఇవ్వక పోవడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలను సభ నుంచి బయటకు వచ్చేశారు. సస్పెండ్ అనంతరం బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో కూర్చున్న జగదీష్ రెడ్డిని అసెంబ్లీ ప్రాంగణం నుంచి బయటకు వెళ్లాలని చీఫ్ మార్షల్ కోరారు. అయితే సభా వ్యవహారాల నుంచి మాత్రమే సస్పెండ్ చేశారని చీఫ్ మార్షల్‌తో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు వాదించారు. ఏ రూల్ ప్రకారం బయటికి పంపాలని చూస్తున్నారని అడిగి రావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే చెప్పారు. దీంతో చీఫ్ మార్షల్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

# కొందరు నాయకులతో పార్టీకి భారీగా నష్టం

(మొదటి తరువాయి)

పెట్టుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి మీటింగ్లు పెట్టుకుంటే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఎప్పుడు వస్తుందని ప్రశ్నించారు. కేంద్ర అధికారులు గమనించాలన్నారు. తెలంగాణ హిందూ సేఫ్‌గా ఉండాలంటే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావాలన్నారు. బీజేపీ గవర్నమెంట్ రావాలంటే పాత సామాను బీజేపీ నుంచి బయటికి వెళ్లి పోవాలన్నారు. కేంద్ర అధికారులు దీనిపైన ఆలోచన చేయాలని కోరారు. ఇది నా పార్టీ.. నా అయ్యా పార్టీ అనేవాళ్లు తెలంగాణలో చాలామంది ఉన్నారన్నారు. వాళ్లని రిటైర్ చేస్తేనే తెలంగాణలో బీజేపీకి మంచి రోజులు వస్తాయన్నారు. ఇది తాను కాదు ప్రతి ఒక్క బీజేపీ సీనియర్ అధికారులు, కార్యకర్తలు ఇదే అనుకుంటున్నారని లేఖలో రాజాసింగ్ పేర్కొన్నారు. గతంలో కూడా బీజేపీని ఒకే సామాజిక వర్గానికి వ్యక్తులు శాసిస్తున్నారని, రాష్ట్ర నాయకత్వం అంతా కూడా రెడ్డి సామాజిక వర్గం చేతిలో ఉందంటూ బాహాటంగానే వ్యాఖ్యలు చేశారు. బీజేపీఎల్పీ నేతగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని హోదాలో కిషన్ రెడ్డి ఒకే సామాజికవర్గానికి చెందిన వ్యక్తులు ఉన్నట్లు అప్పట్లోనే రాజాసింగ్ లేఖ రాశారు. దీనిపై బీజేపీ జాతీయ నాయకత్వం పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పార్టీలో సముచిత స్థానం ఇస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ధీటుగా ఎదిగే అవకాశం ఉంటుందని నెలరోజుల క్రితం రాజాసింగ్ విడుదల చేసి లేఖ కూడా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలు కొనసాగిస్తుండగా కొంతమంది బీజేపీ పార్టీ నుంచి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు రహస్యంగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో సమావేశం అవుతున్నారని, ఇది బీజేపీకి మంచిది కాదన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే బీజేపీ రాష్ట్ర నాయకత్వంలో మొదటి నుంచి పేరుకుపోయిన చాలా మంది నేతలను పార్టీ నుంచి బయటకు పంపించి వేయాలని, వాళ్లని పార్టీ నుంచి బహిష్కరించాలన్నారు. దాంతో పాటుగా పార్టీని తమ అయ్య జాగీరుగా భావిస్తున్న వారు బీజేపీలో చాలా మంది ఉన్నారని, వారంతో కొన్ని సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే అంటూ ఆరోపణలు చేస్తూ లేఖను రిలీజ్ చేశారు రాజాసింగ్.

# 15 నుంచి ఒంటిపూట బడులు

(మొదటి తరువాయి)

ఈ క్రమంలో హాఫ్‌డే స్కూల్స్‌పై అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆదేశించింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు మాత్రమే పాఠశాలలు కొనసాగుతాయని పేర్కొంది. ఆ తర్వాత పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అందిస్తారని చెప్పింది. ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలకు హాఫ్ డే ఉంటుందని.. ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక పదో తరగతి వార్షిక పరీక్షలు జరిగే పాఠశాల్లో మాత్రం తరగతులు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయని పేర్కొంది. ఈ మేరకు పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులను తెలియజేయడంతో పాటు అమలును స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్ట్ ఆదేశించారు.

# తెలంగ్గాణలో భారత్ 'సమ్మిట్'

(మొదటి తరువాయి)

ఆ విషయంపైనే విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కలుస్తున్నట్లు సీఎం తెలిపారు. రాష్ట్రంలో 'మిస్ వరల్డ్' పోటీలు జరగనున్నాయని.. నెలరోజుల పాటు దీనికి సంబంధించిన కార్యక్రమాలు ఉంటాయన్నారు. దీనికోసం రెండు రోజుల్లో అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు .విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కలిసేందుకు ఢిల్లీ చేరుకున్న సందర్భంగా సీఎం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడారు. గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధముందని.. ఫొటోలు దిగి చూపించుకోవాల్సిన అవసరం లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తానెవరో తెలియ కుండానే పీసీసీ అధ్యక్షుడు, సీఎం పదవులకు ఎంపిక చేస్తారా? అని ప్రశ్నించారు. ఎవరి ట్రాప్‌లోనూ తాను పడనన్నారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ గవర్నర్ ప్రసంగానికి రావడం కాదని.. అసెంబ్లీలో చర్చకు హాజరుకావాలన్నారు. డీలిమిటేషన్.. లిమిటేషన్ ఫర్ సౌత్ అని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి రావాల్సిన వాటిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. ఆయా అంశాలు సాధించుకురావాలనే ఆయన్ను ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నారు కాబట్టే రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు సాధించుకొని రావాలని తాను ప్రశ్నిస్తున్నానని చెప్పారు. మిగతా రాష్ట్రాల కేంద్ర మంత్రులు వారి స్టేట్స్ కు కావాల్సినవి సాధించుకుంటున్నారని చెప్పారు. కిషన్ రెడ్డి మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. తాను ప్రధానిని ఆరు గ్యారెంటీలు అడగడం లేదని, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన అడుగుతున్నానని చెప్పారు. కేంద్రం నుంచి రావాల్సిన ప్రాజెక్టులపై విన్నవిస్తున్నట్టు చెప్పారు. మెట్రోకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపితే పనులు మొదలవుతాయని అన్నారు. మెట్రో విస్తరణ హైదరాబాద్ కు గేమ్ చేంజర్ గా మారనుందని అన్నారు. పదేండ్లలో కేసీఆర్ ఒక్క పాలసీ కూడా తేలేదని, తాను చేసినన్ని ఎవరూ చేయలేదని అన్నారు. నిరుద్యోగాన్ని 8.8 శాతం నుంచి 6.2శాతానికి తగ్గించగలిగానని అన్నారు. 2.2 లక్షల కోట్ల పెట్టుడులు తెలంగాణకి తెచ్చామని వివరించారు. పన్ను వసూళ్ల లో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. రైతుల పొలాలు ఎండిపోతుంటే, టన్నెల్ లో ప్రాణాలు పోతుంటే, ప్రజలు కష్టాల్లో ఉంటే బిఆర్ఎస్ నేతలు డ్యాన్సులు వేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తెలంగాణ లో ఐదు ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

(మొదటి తరువాయి)

అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు నిబంధనల మేరకు లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి వాటిని తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం సాయంత్రం 5గంటలకు ముగిసింది. దీంతో ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. దాసోజు శ్రవణ్ ఎట్టకేలకు చట్టసభలో ప్రవేశించే అవకాశం దక్కించుకున్నారు. గతంలో గవర్నర్ కోటాలో దాఓజును నామినేట్ చేసినా ఆనాటి గవర్నర్ తమిళసై తిరస్కరించడంతో ఆయన అవకాశం కోల్పోయారు.

# ఉద్దేశ్యపూర్వకంగానే సస్పెండ్

(మొదటి తరువాయి)

జగదీశ్‌రెడ్డి అగౌరవంగా మాట్లాడలేదు. అనని మాటను అన్నట్టుగా చిత్రీకరించారు. నిబంధనలకు విరుద్ధంగా సభలో ఏమీ మాట్లాడకపోయినా.. ఈ సమావేశాలు పూర్తయ్యే వరకు ఆయన్ను సస్పెండ్ చేయడం దారుణం అన్నారు. స్పీకర్ పట్ల ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, తాను చేసిన తప్పేంటని వివరణ అడిగే అవకాశం కూడా జగదీశ్‌రెడ్డికి ఇవ్వలేదు. స్పీకర్ బాధపడి ఉంటే విచారం వ్యక్తం చేయాలని, సభ సజావుగా జరిగేందుకు సహకరించాలని ఆదేశించాలన్నారు. ఇదే విషయాన్ని స్పీకర్, మంత్రి శ్రీధర్‌బాబుకు స్పష్టంగా చెప్పాం. అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని కోరాం. అయినా, పట్టించుకోకుండా నియంతృత్వ పోకడలతో సభను 5 గంటలపాటు వాయిదా వేశారు. ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు మంత్రులతో మాట్లాడించి.. జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకుంటారని కేటీఆర్ అన్నారు.

# మద్యం దిగుమతులపై 200 శాతం పన్ను

(మొదటి తరువాయి)

విధిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ హెచ్చరికలు చేశారు. 'యూరోపియన్ యూనియన్ అధికారులు ప్రపంచంలోనే అత్యంత శతృవులుగా వ్యవహరిస్తూ అవమానకరంగా పన్నులు వేస్తున్నారు. అమెరికాను దెబ్బతీయడమే వారి ఏకైక లక్ష్యం. విస్కీపై యాభై శాతం సుంకాన్ని వసూలు చేస్తున్నారు. దీనిని తక్షణమే తొలగించకపోతే మేము కూడా ఫ్రాన్స్, ఇతర యూరోపియన్ యూనియన్ దేశాల నుండి వస్తున్న అన్ని రకాల వైన్స్, షాంపైన్లు, ఆల్కహాల్ ఉత్పత్తులపై త్వరలోనే 200 శాతం సుంకం వేస్తాం. అని పేర్కొన్నారు.

## తెలుగు పంచాంగం 14,3/2025,శుక్రవారం



సూర్యోదయం: ఉదయం 6:28
సూర్యాస్తమయం: సాయంత్రం 6:22
తిథి:
పౌర్ణమి: మార్చి 13 ఉదయం 10:36 నుండి మార్చి 14 మధ్యాహ్నం 12:24 వరకు
కృష్ణ పక్ష ప్రతిపద: మార్చి 14 మధ్యాహ్నం 12:24 నుండి మార్చి 15 మధ్యాహ్నం 2:33 వరకు
నక్షత్రం:
ఉత్తర ఫాల్గుని: మార్చి 14 ఉదయం 6:19 నుండి మార్చి 15 ఉదయం 8:54 వరకు
అశుభ సమయాలు :
రాహుకాలం: ఉదయం 10:56 నుండి మధ్యాహ్నం 12:25 వరకు
యమగండం: మధ్యాహ్నం 3:23 నుండి సాయంత్రం 4:52 వరకు
దుర్ముహూర్తం: ఉదయం 8:51 నుండి 9:38 వరకు, మధ్యాహ్నం 12:49 నుండి 1:36 వరకు
వర్జ్యం: మధ్యాహ్నం 2:17 నుండి 4:03 వరకు
శుభ సమయాలు :
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 12:01 నుండి 12:49 వరకు

# ప్రపంచ కిడ్నీ దినోత్సవం

**-షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రి డయాలసిస్ కేంద్రంలో అవగాహన కార్యక్రమం**




**షాద్ నగర్, మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రి డయాలసిస్ సెంటర్‌లో ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కిడ్నీ ఆరోగ్యం యొక్క ప్రాధాన్యతను చర్చించారు. ఈ ఏడాది థీమ్ "మీ కిడ్నీలు బాగున్నాయా? ముందుగానే గుర్తించండి. కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడండి" అని ఉంది. డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఈ రోజుల్లో తీసుకునే ఆహారపు అలవాట్ల కారణంగా, ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్ వినియోగం, ఆల్కహాల్ సేవించడం, స్మోకింగ్ చేయడం, మరియు తగినన్ని నీళ్ల త్రాగకపోవడం వంటివి కిడ్నీ వ్యాధులకు కారణమవుతున్నాయని చెప్పారు. కిడ్నీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం, వ్యాధిని ముందుగానే గుర్తించడం, సరైన చికిత్సతో దీర్ఘకాలిక సమస్యలను నివారించవచ్చని ఆయన వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మార్చి రెండవ గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. ప్రపంచంలో ప్రతి 10 మందిలో ఒకరికి దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి ఉందని, వీటికి జన్యు సంబంధాలు, మధుమేహం, అధిక రక్తపోటు వంటి అంశాలు ప్రమాదకరంగా మారతాయని తెలిపారు. ప్రజలు కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అవలంబించాలని, ఎక్కువగా నీళ్లు తాగాలని, మరియు తగిన వ్యాయామం చేయాలని సూచించారు. డయాలసిస్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న రోగులు సిబ్బంది అందించే సేవలపై హర్షం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ సుమారు 18 మంది, నెలకు 400 మందికి డయాలసిస్ చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమం రోగులు మరియు సిబ్బంది పాల్గొనగా, కేక్ కటింగ్ తో ముగింపు ఘట్టం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తిక్, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, మేనేజర్ అనీష్, ఆరోగ్యశ్రీ మేనేజర్ రాజశేఖర్, డయాలసిస్ సెంటర్ ఇన్చార్జ్ శ్రీనివాసులు, మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మూత్రపిండాల ఆరోగ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ఒక ముఖ్యమైన చొరవగా నిలిచింది.

## రైతుబంధుపై ఓ రైతు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జర్నలిస్టులను అరెస్టు చేస్తారా?

**-ఇదెక్కడి ప్రజాస్వామ్యం**
**-మహిళా జర్నలిస్టులను అరెస్ట్ చేయడానికి తీవ్రంగా ఖండించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**




**షాద్ నగర్, మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై జర్నలిస్టులు వార్తలను ప్రసారం చేస్తుంటే అప్రజా స్వామి ఇక పద్ధతిలో మహిళా జర్నలిస్టులు అని కూడా చూడకుండా అరెస్టులు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు నిధుల విడుదలలో అలసత్వం వహించడం పట్ల రైతు తమ ఆవేదనను వ్యక్తం చేసిన తీరును మహిళా జర్నలిస్టులు రేవతి, తన్వి యాదవుల్ తమ యూట్యూబ్ ఛానల్ లో ప్రసారం చేస్తే, వివరణ ఇవ్వవలసిన ప్రభుత్వం జర్నలిస్టులను అరెస్టు చేయడం దురదృష్టకరమని, జర్నలిస్టుల్లో అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ లోపాలు ఉంటే ప్రశ్నించే హక్కు మీడియాకు ఉంటుందని, రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే బాధ్యత జర్నలిస్టులకు ఉంటుందని విషయాన్ని ప్రభుత్వం గుర్తించకపోవడమే కాకుండా జర్నలిస్టులను నిర్బంధించడం భావ్యం కాదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అరెస్ట్ అయిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు..

**తెలంగాణ విద్యాశాఖ ప్రకటన**


**హైదరాబాద్,మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
తెలంగాణలో మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్న అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పనిచేస్తాయని పేర్కొంది. పిల్లలకు 12.30గంటలకు మధ్యాహ్న భోజనం అందించి ఇంటికి పంపనున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల్ని సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఎస్‌సీ పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలు మాత్రం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. 2024- 25 విద్యా సంవత్సరంలో ఆఖరి రోజైన ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ ఆదేశాలను అన్ని మేనేజ్‌మెంట్లు అమలు చేసేలా పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించిన వంగేటి లక్ష్మా రెడ్డి



**ఇబ్రహీంపట్నం,మార్చి 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీ విశాలాంధ్ర రిపోర్టర్ శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మరణించిన సమాచారం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ వంగేటి లక్ష్మా రెడ్డి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు రూ. 11 వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని తెలిపారు.

## ఉపాధ్యక్షులుగా గొల్లపల్లి భాస్కర్ గౌడ్ నియమాకం




**ఇబ్రహీంపట్నం,మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షులుగా గొల్లపల్లి భాస్కర్ గౌడ్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా గొల్లపల్లి భాస్కర్ గౌడ్ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మస్కు నరసింహ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ ముదిరాజ్ నల్లవెల్లి గ్రామం మాజీ ఎంపిటిసి లక్ష్మీపతి గౌడ్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు సన్నాయిల శ్యాంసుందర్ యువజన కాంగ్రెస్ నాయకులు గొరిగే హరికిషన్ యాచారం మండలం ఎస్టీసెల్ అధ్యక్షులు మోతిలాల్ నాయక్ బీసీ సెల్ అధ్యక్షులు వరికుప్పల తిరుమలేష్ యాచారం కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు పూజరి రాకేష్ ప్రధాన కార్యదర్శి సపావట్ కిషన్ నాయక్ నల్లవెల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కనమోని జంగయ్య దేవ్ సింగ్ రాజేందర్ మాల్ నల్లవెల్లి కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సినీ దర్శకుడు డాక్టర్ పిసి ఆదిత్య ను అభినందించిన ఉప్పల



**ఎల్బీనగర్,మార్చి 13( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
సినీ దర్శకుడు డాక్టర్ పిసి ఆదిత్య కు మహాత్మా గాంధీ స్మారక పురస్కారం అందుకున్న సందర్భంగా నాగోల్ లోని తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించిన TPCC ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...నిత్య ప్రయోగశీలి విలక్షణ దర్శకుడు డాక్టర్ పి సి ఆదిత్యను మరో అత్యున్నత పురస్కారం వరించింది. భువనేశ్వర్ ఒడిస్సా కు చెందిన ప్రముఖ సేవా సంస్కృతిక సంస్థ ఫేమస్ పీపుల్ ఇండియా వారు దర్శకుడు పిసి ఆదిత్యను ప్రముఖ వ్యక్తిగా గుర్తించి మహాత్మా గాంధీ స్మారక విశిష్ట వ్యక్తిగా అవార్డును ప్రకటించారు అని ఈరోజు ఈ విశిష్ట పురస్కారాన్ని ఆదిత్య సత్కరించి మహాత్మా గాంధీ స్మారక పురస్కారం అందజేసి అభినందించారు. గత 30 ఏళ్లుగా సినీ రంగంలో ఎన్నో ప్రయోగాత్మక చిత్రాలు రూపొందించి ఎందరో నూతన కళాకారులను ప్రోత్సహిస్తున్నటువంటి ఆదిత్య సినీ రంగానికి మరిన్ని సేవలు అందించి ఎన్నో అవార్డులు అందుకోవాలని అన్నారు. ఈ విశిష్ట పురస్కారం అందుకున్న ఆదిత్య స్పందిస్తూ నా ఆ విశ్రాంతి సినీ ప్రయాణంలో మరి కొంతమంది నూతననటీనటుల్ని సాంకేతిక నిపుణులను ప్రోత్సహిస్తానని హామీ ఇచ్చారు.

## సింగరాజుపల్లి రేషన్ షాపులో బయోమెట్రిక్ సౌకర్యం కల్పించాలి



**దేవరకొండ, మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సింగరాజుపల్లి గ్రామ ప్రజలు తమ రేషన్ పొందడంలో సమస్యలను ఎదుర్కొంటున్నారు. రేషన్ షాపులో బయోమెట్రిక్ నమోదు సౌకర్యం లేకపోవడం ప్రధాన కారణం. ఈ సమస్యను గ్రామ మాజీ సర్పంచ్ పొనుగోటి రవీందర్ రావు ఆర్డీవో రమణారెడ్డిని కలిసి వినతి పత్రం ద్వారా తెలియజేశారు.
ప్రస్తుతం, రేషన్ షాపులో బయోమెట్రిక్ పద్ధతి లేకపోవడం వలస కూలీలకు రేషన్ అందకుండా చేయడం ద్వారా ఆహార భద్రతను దూరం చేస్తోంది. ఇది వారి కుటుంబాలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. "గ్రామ ప్రజలకు అందుబాటులో ఉన్న రేషన్ సౌకర్యం బయోమెట్రిక్ సదుపాయం లేకపోవడం వల్ల అందరికీ అందుబాటులో లేదు. తక్షణమే ఈ సౌకర్యం కల్పించాలని కోరుతున్నాము," అని రవీందర్ రావు తెలిపారు. ఈ సమస్యకు గ్రామ ప్రజలు గట్టి మద్దతు తెలుపుతూ, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రేషన్ సౌకర్యం పునరుద్ధరించడం ద్వారా పేదల ఆహార భద్రతను కాపాడే మార్గం వేగవంతం అవుతుంది. వినతిపత్రంపై ఆర్డీవో రమణారెడ్డి స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు తమ సమస్యకు త్వరిత పరిష్కారం పొందుతారనే ఆశతో ఉన్నారు.

## ఎంఎస్ఎఫ్ విద్యార్థి నాయకుల శాంతియుత రిలే దీక్ష




**దేవరకొండ, మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేవరకొండ నియోజకవర్గంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండవ రోజు రిలే దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకుడు, ఎంఎస్ఎఫ్ ఇంచార్జ్ నల్ల శ్రీకాంత్ జాంభవ్, తన ఇంటర్మీడియట్ పరీక్షల మధ్యలో కూడా పాల్గొని, దీక్షకు తన మద్దతు తెలిపారు. నల్ల శ్రీకాంత్ మాట్లాడుతూ, "జెడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు తన ఎదుగుదలకు మాదిగలే కారణమని రేవంత్ రెడ్డి అనేక సభల్లో చెప్పారు. అయితే, ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకురావడం ద్వారా మాదిగలకు న్యాయం చేయడం ఆయన నైతిక బాధ్యత" అని పేర్కొన్నారు. అయితే, ఎస్సీ వర్గీకరణ లేకుండానే 11 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయడం ద్వారా మాదిగలకు అన్యాయం జరిగిందని, అలాగే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షల ఫలితాలు విడుదల చేయడం ద్వారా మరింత అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. మాదిగలకు మాటలు చెప్పి మాలలకు ఉద్యోగాలు దోచిపెడుతున్నారని విమర్శించారు.

# విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించాలి.

-షాద్నగర్ ప్రభుత్వ పాఠశాల లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు రైటింగ్ ఫ్యాడ్ పెన్ వితరణ.
-ముఖ్య అతిథులుగా హజరైన మండల విద్యా శాఖ అధికారి మనోహర్ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ చౌహన్.
-ప్రతి ఒక్క విద్యార్థులు బాబాసాహెబ్ అంబేద్కర్ మరియు పూలే సావిత్రిబాయి అడుగుజాడల్లో నడవాలి




**ఫరూక్ నగర్, మార్చి 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు మండల విద్యా శాఖ అధికారి టి.మనోహర్,ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్..గురువారం ఫరూక్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సీ ఎస్టీ, హాస్టల్,ఫరూక్ నగర్ పదవ తరగతి పరీక్షలు రాసే బాలుర,బాలికలకు ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు పవన్ చౌహన్ లతో కలిసి మండల విద్యా శాఖ అధికారి రైటింగ్ ఫ్యాడ్స్,పెన్నులను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ,,, రాబోయే 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు అందరూ పరీక్షలు బాగా రాసి అందరూ ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు.విద్యార్థుల కోసం,విద్యా వ్యవస్థ కోసం ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఆకాష్ నాయక్ చేస్తున్న సేవలను మండల విద్యా శాఖ అధికారి, మనోహర్ జిల్లా (ఏఐఎస్ఎఫ్) అధ్యక్షులు పవన్ చౌహన్ కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శైలజ,శంకరయ్య,తిరుపతిరెడ్డి,ఉపాధ్యాయుల బృందం, ఏఐఎస్ఎఫ్ నాయకులు, శ్రీను, అరుణ్, రాజేష్, సునీల్, చందు, తదితరులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు...

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

మమ్మల్ని సంప్రదించడానికి:
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

మీ గొంతుకకు మేమే వేదిక – నీలగిరి ఎక్స్‌ప్రెస్!

## స్పీకర్ కి జగదీశ్వర్ రెడ్డి క్షమాపణ చెప్పాలని మల్లయ్య డిమాండ్



**ఆమనగల్లు, మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** గురువారం పట్టణ కేంద్రంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాలే మల్లయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు గురయ్యాయి. దళితులను అత్యున్నత స్థానంలో కూర్చోబెట్టిన కాంగ్రెస్ పార్టీ స్పీకర్‌ను ఏకవచనంతో మాట్లాడడం జగదీశ్వర్ రెడ్డి అహంకారానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కాలే మల్లయ్య మాట్లాడుతూ, "జగదీశ్వర్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని,స్పీకర్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలి," అని డిమాండ్ చేశారు. దళితుల హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, ఈ ఘటన దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని ఆయన అన్నారు.

## విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ




**కల్వకుర్తి, మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కల్వకుర్తి మండలం లోని రఘుపతిపేట గ్రామ జెడ్పీ.హెచ్.యస్ పాఠశాలలో క్లాస్మేట్ క్లబ్ కల్వకుర్తి వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు జయంతి సందర్భంగా 10 వ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేశారు క్లాస్మేట్ క్లబ్ కల్వకుర్తి డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి రాజేందర్ మాట్లాడుతూ క్లబ్ సేవలను వినియోగించుకుని,విద్యార్థులు బాగాచదివి ఉన్నత స్థాయిలో వుండాలని కోరడం జరిగింది. క్లాస్మేట్ క్లబ్ ఫౌండర్ రాఘవేందర్,దాతల సహకారంతో రఘుపతిపేట గ్రామంలో ఇద్దరు విద్యార్థులకు బిటెక్ (ఇంజనీరింగ్ ) చదవడం కోసం క్లాస్మేట్ క్లబ్ ద్వారా లక్ష రూపాయలు వరకు సహాయం అందించడం జరిగింది అని అన్నారు . పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు పలికారు కార్యక్రమంలో పాఠశాల GHM అంజయ్య, క్లాస్మేట్ క్లబ్ సభ్యులు రవీందర్ రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణ, అంజి, మల్లయ్య ,షకీల్ ,తిరుపతయ్య ఉపాధ్యాయినీలు విజ్జీ,జయశ్రీ,తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అందుబాటులోకి నూతన బస్సు




**మేకగూడ,మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మేకగూడ గ్రామ ప్రజల కాంక్షను నెరవేర్చుతూ, గ్రామానికి నూతనంగా ప్రభుత్వ బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. గ్రామస్తులు ఈ బస్సు ప్రారంభం వెనుక ముఖ్య పాత్ర పోషించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, మరియు దేపల్లి అశోక్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, గ్రామ పెద్దలు కలిసి పాల్గొని, బస్సు ప్రారంభోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు. గ్రామస్తులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఈ బస్సు ప్రారంభం గ్రామ అభివృద్ధికి తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాను ప్రసాద్, రవితేజ, సాయి ప్రకాష్, రాఘవేందర్, శ్రీకాంత్, వంశీ తదితరులు హాజరయ్యారు. గ్రామ అభివృద్ధి కాంక్షతో గ్రామస్తుల చొరవ, నాయకుల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతమైంది.

## నాగర్ కర్నూల్ బీసీ కాలనీ సమస్యలపై నిరసనకు బీజేపీ మద్దతు



**ంనాగర్ కర్నూల్,మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు బీసీ కాలనీ సమస్యలపై బీసీ కాలనీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్ కర్నూల్ భారతీయ జనతా పార్టీ మద్దతు ప్రకటించింది. ఈ నిరసనలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్లరాజ వర్ధన్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు ఎలిమే రాము, ప్రధాన కార్యదర్శి చెవ్వ ప్రమోద్, సోషల్ మీడియా కన్వీనర్ వారధి శీను, వెంకటేశుభూత్ అధ్యక్షులు బాలరాజు, జాజాల కృష్ణ, జాజాల పరశురాం తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం బీసీ కాలనీ సమస్యల పరిష్కారానికి సంబంధించి అధికారుల దృష్టిని ఆకర్షించడమే లక్ష్యంగా నిర్వహించబడింది. బీసీ కాలనీ పరిరక్షణ కమిటీ సభ్యులు తమ సమస్యలను స్పష్టంగా తెలియజేసి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## కామ దహన పూజలో పాల్గొన్న ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు



**షాద్ నగర్, మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పాత గంజిలో నిర్వహించిన కామ దహన పూజలో ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దోమ నరసింహులు, కోశాధికారి నీల రవీందర్, సరాపు వెంకటేష్, కట్ట పుల్లయ్య, బండారి కుమార్, మలిపెద్ది వెంకటరమణ, భరత్ లాహోటి, గందె రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీలో మొండి గౌరెల్లి, మంథన్ గౌరెల్లి గ్రామాలను కలపాలని వినతి



**యాచారం,మార్చి 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )** ఫ్యూచర్ సిటీలో యాచారం మండల పరిధిలోని మొండి గౌరెల్లి, మంథన్ గౌరెల్లి గ్రామాలను కలపాలని రంగా రెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి కలిసిన మొండి గౌరెల్లి మంథన్ గౌరెల్లి పలు పార్టీ నాయకులు గ్రామస్తులు మాజీ ప్రజాప్రతినిధులు వినతి పత్రం అందజేశారు యాచారం మండలంలోని వెనుకబడిన ప్రాంతాలలో మొండిగౌరెల్లి , మంతన్ గౌరెల్లి డ్రామాలు ఉన్నాయని వాట్ అభివృద్ధి కోసం కలపాలని వారు కోరుకోరారు.

## క్రీడల్లో ప్రతిభ కనబర్చిన కడ్తాల్ బాలుర పాఠశాల విద్యార్థులు




**కడ్తాల్, మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో పాఠశాల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్మాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీలలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కడ్తాల్ టీం పాల్గొని ప్రథమ స్థానం సాధించి మే నెలలో ఢిల్లీలో జరుగబోయే పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన 6 మంది విద్యార్థులు అరవింద్,తరుణ్,ఉదయ్,సాయి కిరణ్, నాని, శశీ వర్ధన్ లను గురువారం పీఈటీ, భీముడు ని ప్రధానోపాధ్యాయుడు జంగయ్య, ఎంఈఓ సత్య నారాయణ ప్రత్యేకంగా అభినందించారు.పాఠశాలకు,మన మండలానికి మంచి పేరు తెచ్చినందుకు హర్షం వ్యక్తం చేస్తూ, రేపు జాతీయస్థాయిలో కూడా రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని హెచ్ఎం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేష్, స్వేత,ఇంద్రారెడ్డి ,కౌసల్య ,భాగ్యలక్ష్మి ,శోభారాణి ,బుచ్చమ్మ, సునిత ,భాగ్యమ్మ ,గీతా భాయ్ ,స్రవంతి మండల ఉపాధ్యాయులు శంకర్ నాయక్ ,మల్లయ్య, తిరుపతి ,ప్రవీణ్ రెడ్డి, లక్ష్మీనారాయణ ,రహీం పాష ,విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన సింగం శ్రీనయ్య




**ఆమనగల్లు, మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన సంపంగి కిష్టమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు ఈరోజు మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిజెపి పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు సింగం శ్రీనయ్య కిష్టమ్మ మృత దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ స్టాప్ రద్దు




**సికింద్రాబాద్,మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్ )** విశాఖపట్నం- లింగంపల్లి-విశాఖపట్నం మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కు సికింద్రాబాద్‌లో స్టాప్‌ను రద్దు చేశారు.ఏప్రిల్ 25 నుంచి ఇది అమల్లోకి వస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలును చర్లపల్లి-అమ్ముగూడ-సనత్‌నగర్ మీదుగా శాశ్వత ప్రాతిపదికన దారి మళ్లిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 25 నుంచి సికింద్రాబాద్, బేగంపేట్ స్టేషన్ల వైపు వెళ్లదని అధికారులు తెలిపారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం - లింగంపల్లి - విశాఖపట్నం మధ్య ప్రతి రోజూ నడుస్తోంది.

# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

## హోలీ శుభాకాంక్షలు తెలిపిన అమరవాది లక్ష్మీనారయణ గుప్త



**ఎల్బీనగర్,మార్చి 13 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త , రాష్ట్ర పొలిటికల్ చైర్మన్, వనస్థలిపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవి కుమార్ గుప్త హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ రంగుల పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలన్నారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలు జరుపుకునే ఈ పండుగ సమైక్యతకు అద్దం పడుతుందని అభిప్రాయ పడ్డారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఈ హోలీ పండుగ అందరి కుటుంబాల్లో ఆనందోత్సాహాలు నింపాలని ఆకాంక్షించారు.

## వికలాంగుల హక్కుల కోసం వంగూరులో సంతకాల సేకరణ





**వంగూర్, మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వంగూరు మండల కేంద్రంలో గురువారం ఎన్ పి ఆర్ డి వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సంస్థలలో వికలాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సంతకాల సేకరణ ఉద్యమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, నామినేట్ పోస్టుల్లో స్థానిక సంస్థల వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఈ రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పి. బాలేశ్వర్, కే. గౌతమ్, మాజీ వార్డ్ మెంబర్ డి. శ్రీనివాసులు, దామోదర్, తిరుమలగిరి మాజీ సర్పంచ్ కడారి మల్లయ్య, గాజర, సీనియర్ కాంగ్రెస్ నేతలు నిరంజన్ రెడ్డి, విష్ణు, బద్దుల రాజు, సిపిఎం మండల కార్యదర్శి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దవూర మండల అఖిల భారత యాదవ మహాసభ నూతన కమిటీ ఎన్నిక

**పెద్దవూర,మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యాదవ సంఘం ఐక్యత మరియు అభివృద్ధి దిశగా కీలకమైన అడుగుగా, పెద్దవూర మండల అఖిల భారత యాదవ మహాసభ ఇటీవల నూతన కమిటీ ఎన్నికల సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి సీనియర్ నాయకులు మరియు మాజీ సర్పంచ్ నడ్డి లింగయ్య యాదవ్ గారు అధ్యక్షత వహించారు.
నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు:
అధ్యక్షులు: వీరబోయిన వెంకటయ్య యాదవ్
ప్రధాన కార్యదర్శి: కుంటి గొర్ల రాజశేఖర్ యాదవ్
యూత్ అధ్యక్షులు: మన్నెం రాము యాదవ్
వర్కింగ్ ప్రెసిడెంట్: రేపాకుల సాయికుమార్ యాదవ్
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ గారు, రాష్ట్ర కార్యదర్శి లోడంగి గోవర్ధన్ యాదవ్ గారు, మరియు మాజీ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ అధ్యక్షులు సోమనబోయిన సుధాకర్ యాదవ్ గారు హాజరయ్యారు. వీరి హాజరు యాదవ సంఘం ఐక్యతకు మరియు అభివృద్ధికి ప్రాధాన్యతను చాటిచెప్పింది. ఈ సమావేశంలో రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు మరియు సంఘం అభివృద్ధి వంటి ముఖ్య అంశాలపై చర్చ జరిగింది. సంఘం నాయకత్వం, దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించడానికి సభ్యుల ఐక్యత అవసరమని పునరుద్ఘాటించింది. నూతన కమిటీ, యాదవ సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తామని, సంఘం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు కట్టుబడి ఉందని తెలియజేసింది. సంఘం ఐక్యతతో మరింత బలమైన, అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించడమే తమ లక్ష్యమని కమిటీ సభ్యులు తెలిపారు.




# ఖాళీ మద్యం సీసాల నరేష్ దండు పోరాటానికి కదిలిన కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి


నీలగిరి ఎక్స్‌ప్రెస్
www.neelagiriexpress.in
25 Dec 2024 - Page 3
రోడ్లపై ఖాళీ సీసాల
ప్రాణం,సమాజం భద్రతకు పెనుము

केन्द्रीय प्रदूषण नियंत्रण बोर्ड
CENTRAL POLLUTION CONTROL BOARD
पर्यावरण, वन एवं जलवायु परिवर्तन मंत्रालय, भारत सरकार
MINISTRY OF ENVIRONMENT, FOREST & CLIMATE CHANGE, GOVT. OF INDIA
CPCB
LiFE Lifestyle for Environment

F. No. PI-14/32/2021-UPC-II-HO-CPCB-HO
Date: 11.03.2025

To,
The Member Secretary,
Telangana State Pollution Control Board
Sanath Nagar Paryavarana Bhavan, A-3,
Industrial Estate, Sanathnagar, Hyderabad – 500018

Sub: - Grievance Registration No. PMOPG/E/2025/0022413 dated 16/02/2025-Reg.

Sir,
This refers to the aforementioned grievance raised by Sh. Naresh Dandu (Copy enclosed) regarding littering of liquor bottles in paddy fields, high roads, and street roads by public.

As per provision 4(1)(2) of Solid Waste Management Rules, 2016, "No waste generator shall throw, burn or burry the solid waste generated by him, on streets, open public spaces outside his premises or in the drain or water bodies."
As per provision 16(1(a) of the SWM Rules, "The State Pollution Control Board or Pollution Control Committee shall enforce these rules in their State through local bodies in their respective jurisdiction and review implementation of these rules at least twice a year in close coordination with concerned Directorate of Municipal Administration or Secretary-in-charge of State Urban Development Department."

I am directed to forward the complaint to take necessary action in accordance with Solid Waste Management Rules, 2016 and Plastic Waste Management Rules, 2016, (As amended) action taken report with a copy to complainant may please be submitted to this office.

Yours faithfully,
(Suniti Parashar)
Scientist 'D' UPC-II Div.

Copy to:
1. DH-PR
2. Regional Director,
Central Pollution Control Board
Regional Directorate (Chennai)
Second floor, No.77-a, South Avenue
Road, Ambattur Industrial Estate
Ambattur Taluk, Thiruvallur District Chennai-600 058, Tamil Nadu
3. Sh Naresh Dandu
Aditya Nagar Phase -3, Gurram guda
Ranga Reddy, Telangana
Mobile no 9010426014
Email Id d.naresh12@gmail.com
(Suniti Parashar)

'परिवेश भवन' पूर्वी अर्जुन नगर, दिल्ली - 110032.
Parivesh Bhawan, East Arjun Nagar, Delhi - 110 032.
दूरभाष /Tel : 43102030, 22305792, वेबसाइट /Website: www.cpcb.nic.in

**హైదరాబాద్, మార్చి 13(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రోడ్లపైన, పంట పొలాల్లో పడి ఉన్న ఖాళీ మద్యం సీసాలు పర్యావరణానికి, ప్రజా ఆరోగ్యానికి పెనుముప్పుగా మారుతున్నాయి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం గమనార్హం. దీన్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) సీరియస్‌గా తీసుకుని, రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. ఈ సమస్యను ఎత్తిచూపుతూ సామాజిక కార్యకర్త నరేష్ దండు చేసిన కృషి, ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిలించడంతో పాటు ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

**సామాజిక బాధ్యత తప్పిస్తున్న ప్రభుత్వం**
స్వతంత్ర భారతంలో మద్యం వినియోగం తగ్గించే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతుంటే, దీనికి పూర్తి విరుద్ధంగా మద్యం అమ్మకాలను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది. అయితే, మద్యం సేవించిన తర్వాత ఖాళీ సీసాల నిర్వహణపై మాత్రం ప్రభుత్వాల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. వీటిని ఎక్కడ పడితే అక్కడ పడేయడం వల్ల రోడ్లపై ప్రయాణించే వారికి ప్రమాదం, రైతులకు నష్టం, పర్యావరణానికి పెద్ద ముప్పుగా మారుతోంది.

**సిపిసిబి జోక్యం -రాష్ట్రాన్ని ప్రశ్నించిన కేంద్రం**
రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోకపోవడంతో, సిపిసిబి నేరుగా జోక్యం చేసుకుని స్పందించింది. "ఖాళీ మద్యం సీసాల వల్ల కలుగుతున్న కాలుష్యం, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ఇప్పటి వరకు ఏం చర్యలు తీసుకున్నారు?" అంటూ సిపిసిబి రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. ఇకనైనా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించినట్లు సమాచారం.

**నరేష్ దండు ఉద్యమం - ప్రజల్లో చైతన్యం**
సామాజిక కార్యకర్త నరేష్ దండు ఖాళీ మద్యం సీసాల వల్ల కలిగే ప్రమాదాలను వివరిస్తూ, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, అధికారులను అడుగడుగునా ప్రశ్నిస్తూ, ఈ సమస్యను సీరియస్‌గా తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఆయన చేసిన ఈ కృషి ఫలితంగా, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసినట్లు తెలుస్తోంది.

**-రాష్ట్రం ఇకనైనా మేలుకొలుకోవాల్సిందే**
ఖాళీ సీసాల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకురావాలి. అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, రీసైక్లింగ్ విధానాలను ప్రోత్సహించాలి. మద్యం కంపెనీలు మరియు షాపులను కూడా ఈ బాధ్యతలో భాగస్వామ్యం చేయాలి. ప్రభుత్వాలు చర్యలు తీసుకునే వరకు సామాజిక ఉద్యమం కొనసాగించాల్సిన అవసరం ఉంది.


నరేష్ దండు

# కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

## -మాజీ సర్పంచ్ దార్ల కుమార్



**వెల్దండ, మార్చి 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో బైరాపూర్ మాజీ సర్పంచ్ దార్ల కుమార్ రాష్ట్రంలో అభివృద్ధి పనుల?గింపు పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ప్రసంగంలో, తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పలు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువైన విషయాన్ని గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలు?గా ఉన్నాయి అని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన ఎక్కడైతే గొంగళి వేసినట్లు ఉందని మండిపడ్డారు.
బైరాపూర్ వాగు వరదల సమయంలో వంతెన కొట్టుకుపోవడంతో అప్పటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చొరవతో రూ. 9 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించి టెండర్లు పిలిపించినా, ఇప్పటికీ పనులు పూర్తి కాలేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వ జాప్యాన్ని ఆక్షేపించారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ అరుణ ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ లింగం ముదిరాజ్, చల్లా మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకుడు జంగిలి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. వారు ప్రభుత్వాన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు.

# తెలంగాణ రైజింగ్‌కు మద్దతుగా నిలవండి...

## -జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి



**న్యూఢిల్లీ మార్చి 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాబోయే 25 సంవత్సరాల్లో తెలంగాణను సమున్నతంగా నిలిపేందుకు తమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి గురువారం కలిశారు. ఈసందర్భంగా 2025 సంవత్సరంలో హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ కార్యక్రమాలైన మిస్ వరల్డ్, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, భారత్ సమ్మిట్, యానిమేషన్ గేమింగ్, వీఎఫ్ఎక్స్‌తో పాటు వినోద పరిశ్రమలో తెలంగాణ బలాన్ని చాటే ఇండియా జాయ్ వివరాలను కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాల నిర్వహణ ద్వారా తెలంగాణ రైజింగ్‌ను ప్రోత్సహించేందుకు మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రి జైశంకర్‌ను సీఎం కోరారు. తెలంగాణ రైజింగ్‌ను విదేశాల్లో భారత్ కార్యక్రమాల్లోనూ ప్రచారం చేయాలని, దౌత్య, లాజిస్టిక్ సహాయంతో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమాల విజయవంతానికి సహకరించాలని కేంద్ర మంత్రి జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి చెందుతున్న రాష్టాల్లో్ర తెలంగాణ ఉందని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమైన హైదరాబాద్‌లో చేపట్టే కార్యక్రమాలకు తమ మంత్రిత్వ శాఖ మద్దతుగా నిలుస్తుందని కేంద్ర మంత్రి జైశంకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, నాగర్ కర్నూలు, భువనగిరి లోక్‌సభ సభ్యులు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# మరోమారు భగ్గుమన్న పసిడి ధర

## రూ.600 పెరిగి రూ.89,450కి చేరిక



**న్యూఢిల్లీ మార్చి 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తగ్గినట్లే తగ్గిన బంగారం ధర మళ్లీ పైకెగసింది. అంతర్జాతీయ మార్కెట్లలో పెరిగిన డిమాండ్ కారణంగా దేశీయంగా మరోసారి పసిడి ధర ఆకాశాన్ని తాకింది. దేశ రాజధాని దిల్లీలో గురువారం 10 గ్రాముల 99.9 శాతం స్వచ్ఛమైన పుత్తడి ధర రూ.600 పెరిగి రూ.89,450కి చేరింది. ఫిబ్రవరి 20న పసిడి ధర రూ.89,450గా నమోదైంది. మళ్లీ దాదాపు 20 రోజుల తర్వాత బంగారం ధర మళ్లీ అదే స్థాయికి చేరిందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అటు వెండి సైతం ఒక్క రోజులో కిలోకు వెయ్యి రూపాయలు మేర పెరిగింది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూ.1,00,200గా ఉన్న వెండి ధర రూ.1,01,200కు చేరింది. ఇది ఐదు నెలల గరిష్ఠానికి సమానం. అంతర్జాతీయంగా చూస్తే బంగారం ఔన్సు ధర 2946 డాలర్లకు చేరింది. అమెరికాలో తాజాగా వెలువడిన ద్రవ్యోల్బణ గణాంకాలు పసిడి ధర పెరగడానికి కారణమయ్యాయి. అంచనాల కంటే తక్కువగా ద్రవ్యోల్బణం నమోదు కావడంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించేందుకు మార్గం సుగమం అవుతుంది. ఈ కారణంతోనే బంగారం వైపు పెట్టుబడులు మళ్లుతున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు.

# హోలీతో పాటు..రంజాన్ శుక్రవారం

## ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు



**హైదరాబాద్,మార్చి 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
35 ఏళ్ల తర్వాత హోలీ పండుగ, రంజాన్ మాసములోని రెండవ శుక్రవారం ఒకే రోజు వచ్చాయని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. రెండు పండుగలు సజావుగా జరిగేందుకు ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ సిటీ పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి జోన్ లోని సున్నితమైన, ముఖ్యమైన ప్రాంతాలలో పికెట్ లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుని జాగ్రత్తగా ఉండాలని పోలీసు అధికారులకు కోరారు. అసాంఘిక శక్తులపై, వెగాబాండ్ లపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సీపీ సూచించారు. రంగుల హోలీ తమ జీవితాలలో వెలుగులు నింపాలని కోరుకుంటున్నామని సీవీ ఆనంద్, డీజీ కమిషనర్ ఆఫ్ పోలీసు తెలిపారు. భాగ్యనగర వాసులకు హోలీ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో విక్రమ్ సింగ్ మాన్ ఐపీఎస్ (అడిషనల్ సీపీ లా అండ్ ఆర్డర్), చైతన్య కుమార్ , జోనల్ అధికారులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భీమ్ దీక్ష పోస్టర్ విడుదల



**వెల్దండ, మార్చి 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో మార్చి 15న జరగనున్న అంబేద్కర్ భీమ్ దీక్ష కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను వెల్దండ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో ఈరోజు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, నాగేష్, జంగిలి యాదగిరి, పోలే అశోక్, గుద్దటి జనార్ధన్, మంగళగిరి సత్యం, డాక్టర్ రాజు, కొయ్యల పుల్లయ్య, జంగయ్య, అనిల్, ఈశ్వర్, గుద్దటి రాజు, కే. వెంకటయ్య, ఈదులపల్లి శీను, ఈదులపల్లి నారాయణ, శశి, కొమ్ములింగం, ఈదులపల్లి జగన్, వెంకటయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు



**వెల్దండ, మార్చి 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు మరియు నిజామాబాద్స్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టినరోజు వేడుకలు వెల్దండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మహిళా కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులలో వెల్దండ మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, మాజీ వార్డు మెంబర్ జంగిలి అర్చన, యాదగిరి, గోరేటి లక్ష్మమ్మ, అల్లడి ప్రమీల, మల్లెపల్లి వెంకటమ్మ, ఆలూరి భారతమ్మ, మల్లెపల్లి భాగ్య, మేకల అరుణమ్మ, కూన ఇందిరమ్మ, మారేడు సునంద, జంగిలి కౌశలమ్మ, జంగిలి అంజమ్మ, మణమ్మ తదితరులు ఉన్నారు.

# మరోమారు ప్రయోగం విఫలం

## సునీతా విలియమ్స్‌కు విషమ పరీక్ష




**వాషింగ్టన్ మార్చి 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన భారత అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్‌కు మరోసారి నిరాశే ఎదురయింది. తొమ్మిది నెలలుగా ఐఎస్ఎస్‌లో ఉంటున్న ఆమె భూమి మీదికి రావడం మరింత ఆలస్యమయ్యేలా ఉంది. ఐఎస్ఎస్ నుంచి సునీతతోపాటు బచ్ విల్మోర్‌ను భూమిపైకి తీసుకొచ్చేందుకు నాసా-స్పేస్ ఎక్స్ సంయుక్తంగా చేపట్టిన క్రూ 10 మిషన్‌లో భాగంగా గురువారం జరగాల్సిన ప్రయోగం వాయిదాపడింది. అమెరికాలోని ఎ÷-లోరిడా నుంచి నలుగురు వ్యోమగాములతో ఫాల్కన్ 9 రాకెట్ బయలుదేరేందుకు క్రూ 10 మిషన్ సిద్ధమైంది. అయితే చివరి నిమిషంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రయోగం నిలిచిపోయింది. హైడ్రాలిక్ సిస్టమ్‌లో సమస్య రావడంతో దీనిని ఆపేసినట్లు నాసా వెల్లడించింది. శుక్ర లేదా శనివారాల్లో ఈ ప్రయోగాన్ని తిరిగి నిర్వహించే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది. కాగా, షెడ్యూల్ ప్రకారం ఈ ప్రయోగం మార్చి 25న జగాల్సి ఉంది. అయితే నాసా దానిని ముందుకు జరిపినా.. అది వాయిదాపడింది. క్రూ-10 ద్వారా కొత్త బృందం ఐఎస్ఎస్‌కు చేరుకోగానే.. స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్ క్యాప్సూల్ ఎండీవర్ ద్వారా సునీత, విల్మోర్‌లు భూమిమీదకు తిరిగి రానున్నారు. టెస్ట్ మిషన్ కోసం బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ అంతరిక్ష నౌకలో విలియమ్స్, విల్‌మోర్ 2024, జూన్ 5న అంతరిక్షంలోకి వెళ్లారు. ఎనిమిది రోజుల తర్వాత వారు భూమి మీదకు తిరిగి రావాల్సి ఉంది. అయితే స్టార్‌లైనర్ స్పేస్ క్రాఫ్ట్.. ఐఎస్ఎస్‌ను చేరుకోగానే సమస్యలు తలెత్తాయి. అందులోని ప్రొపల్షన్ సిస్టమ్‌లో లీకులు ఏర్పడటం, థ్రస్టర్స్ మూసుకుపోవడంతోపాటు హీలియం కూడా అయిపోయింది. ఈ నేపథ్యంలో వ్యోమగాములను ఈ నౌకలో తిరిగి భూమిపైకి తీసుకురావడం సురక్షితం కాదని ఆగస్టు నెలాఖరు నాటికి నాసా ఒక నిర్ణయానికి వచ్చింది. దీంతో వ్యోమగాములు లేకుండా బోయింగ్ స్టార్ లైనర్ 2024, సెప్టెంబర్ 7న క్షేమంగా భూమికి తిరిగి వచ్చింది. అప్పటి నుంచి సునీత, విల్‌మోర్ అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోయారు.

# యువతలో నైపుణ్యం పెంపొందించే యత్నం

## టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో ఎపి ఒప్పందం




**అమరావతి మార్చి 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
యువతలో ఏఐ నైపుణ్యాలు పెంచేందుకు టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఏఐ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏడాది వ్యవధిలో 2 లక్షల మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో మైక్రోసాఫ్ట్, ఏపీఎస్ఎస్‌డీ ఎంవోయూ చేసుకున్నాయి. ఐటీ, ఇతర పరిశ్రమలకు అవసరమైన సిబ్బందిని తయారు చేయడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. దాదాపు 2 లక్షల మంది రాష్ట్ర యువతకు అంతర్జాతీయంగా ఉద్యోగాలు వచ్చే విధంగా మైక్రోసాఫ్ట్ శిక్షణ ఇవ్వనుంది. 50 గ్రామీణ ఇంజినీరింగ్ కాలేజీల్లో 500 మంది అధ్యాపకులకు శిక్షణ ఇవ్వనుంది. 10వేల మంది విద్యార్థులకు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్‌లో, 30 ఐటీఐల్లోని 30 వేల మంది విద్యార్థులకు డిజిటల్ ప్రొడక్టివిటీలో ఏఐ శిక్షణ ఇవ్వనుంచి.

# ఛత్తీస్‌ఘడ్‌లో మావోలకు ఎదురుదెబ్బ

## -పోలీసులకు లొంగిపోయిన 17మంది మావోలు



**బీజాపూర్ మార్చి 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 17మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 9మందిపై రూ.24లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. సీఆర్‌పీఎఫ్ పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు దినేష్ మొడియం (36), అతడి భార్య జ్యోతి తాటి అలియాస్ కళా మొడియం (32) ఉన్నట్లు తెలిపారు. దినేష్ తలపై రూ.8లక్షలు, జ్యోతిపై రూ.5లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు బీజాపూర్ సీనియర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. అలాగే, ఏరియా కమిటీ సభ్యులు దుడ్ల కరంపై రూ.5లక్షలు, మరో ఆరుగురి తలలపై రూ.లక్ష చొప్పున రివార్డు ఉందన్నారు. వీరందరూ గంగలూరు ఏరియా కమిటీలో వివిధ హోదాల్లో చురుగ్గా ఉన్నవారేనన్నారు. వీరి లొంగుబాటు వెనుక డిస్టిక్ట్ర్ రిజర్వ్ గార్డు, బస్తర్ ÷టైర్స్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా దళాలు కీలక పాత్ర పోషించినట్లు ఎస్పీ వివరించారు. సైద్ధాంతిక లోపాలు, అమాయక గిరిజనుల పట్ల కొందరు సీనియర్లు దోపిడీకి పాల్పడటం వంటి చర్యలతో కలత చెందడం, భద్రతా బలగాల ప్రభావం పెరిగిన నేపథ్యంలో వీరంతా లొంగిపోయినట్లు బీజాపూర్ సీనియర్ ఎస్పీ తెలిపారు. అలాగే, గ్రామాల్లో అభివృద్ధి కోసం తాము చేపట్టిన నియా నెల్లనార్' (యువర్ గుడ్ విలేజ్) అనే పథకం పట్ల ఆకర్షితులయ్యారన్నారు. లొంగిపోయిన వారికి రూ. 25వేలు చొప్పున సహాయం అందించామని.. ప్రధాన స్రవంతిలోకి చేర్చేందుకు ప్రభుత్వ విధానం ప్రకారం వారికి పునరావాసం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గతేడాది బస్తర్‌లో 792మంది మావోయిస్టులు లొంగిపోగా.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బీజాపూర్ జిల్లాలో 65మంది లొంగిపోయారు.